- 84 బృందాలతో నిరంతర పర్యవేక్షణ
- సీ-విజిల్ యాప్‌లో 174 ఫిర్యాదులు
- వృద్ధులు, దివ్యాంగుల కోసం ఇంటి నుంచే ఓటు
- యువత, మహిళల కోసం మోడల్ పోలింగ్ స్టేషన్లు
- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పమేలా సత్పతి

# ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి

కలెక్టరేట్, నవంబర్ 18: అసెంబ్లీ ఎన్నికలను విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని రకాల ఏర్పాట్లు చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పమేలా సత్పతి తెలిపారు. నగరంలోని కలెక్టర్ సమావేశ మందిరంలో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ఎన్నికల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లు పూర్తి స్థాయిలో చేపట్టి, నిబంధనలు పటిష్టంగా అమలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఇప్పటికే ఎన్నికల సిబ్బందికి పోలింగ్ నిర్వహణకు అవసరమైన శిక్షణ కూడా ఇచ్చామన్నారు. నిబంధనలు ఉల్లంఘించిన అభ్యర్థులు, పార్టీలపై ఇప్పటికే 174 ఫిర్యాదులు వచ్చాయని, ఫిర్యాదు చేసిన వంద నిమిషాల్లోపే విచారణ జరిపి 134 కేసులు పరిష్కరించామన్నారు. మరో రెండు కేసుల్లో బలమైన ఆధారాలు లభించడంతో ఎఫ్ఐఆర్ నమోదు చేసినట్లు తెలిపారు. జిల్లాలోని నాలుగు అసెంబ్లీ సెగ్మెంట్లలో 73 మంది ఎన్నికల బరిలో నిలువగా వీరిలో కరీంనగర్ నుంచి 27 మంది, చొప్పదండిలో 14 మంది, హుజూరాబాద్‌లో 22 మంది, మానకొండూర్‌లో 10 మంది అభ్యర్థులు బరిలో ఉన్నట్లు పేర్కొన్నారు. రెండు అసెంబ్లీ స్థానాల్లో అభ్యర్థుల సంఖ్య 20కి మించి ఉండడంతో ఆ సెగ్మెంట్లలో రెండేసి బ్యాలెట్ యూనిట్లు ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ఆ సెగ్మెంట్లకు అవసరమైన అదనపు బ్యాలెట్ యూనిట్ల ర్యాండమైజేషన్ కూడా పూర్తి చేసి పంపిణీ కేంద్రాలకు తరలించామన్నారు. జిల్లా వ్యాప్తంగా 1,338 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. ఈనెల 6న విడుదల చేసిన తుది ఓటర్ల జాబితా ప్రకారం జిల్లాలో కొత్తగా 25వేల మంది ఓటర్లు నమోదయ్యారన్నారు. వీరిలో 5,500 మంది వరకు 18 ఏండ్ల వారన్నారు. మిగతా వారంతా 20 నుంచి 29 ఏండ్ల లోపు యువతే ఓటు హక్కు నమోదు చేసుకున్నట్లు గుర్తించామన్నారు. అదనపు ఓటర్ల జాబితా విడుదలైన అనంతరం జిల్లాలో 2,541 బ్యాలెట్ యూనిట్లు, 1,671 కంట్రోల్ యూనిట్లు, 1,872 వీవీ ప్యాట్లు వినియోగించనున్నట్లు వివరించారు. ఎనభై ఏండ్లకు పైబడిన వృద్ధులు, నలభై శాతానికి మించి అంగవైకల్యం కలిగిన వారు నేరుగా ఇంటి నుంచే ఓటేసేందుకు అవసరమైన ఏర్పాట్లు చేసినట్లు వెల్లడించారు. 48 థిమెటిక్ పోలింగ్‌స్టేషన్లు కేటాయించగా ప్రతి అసెంబ్లీ సెగ్మెంట్‌కు మహిళల కోసం (మహిళలే నిర్వహించే) ఐదు చొప్పున పీఎస్‌లు , దివ్యాంగుల కోసం నాలుగు, యువత



మాట్లాడుతున్న కరీంనగర్ జిల్లా ఎన్నికల అధికారి పమేలా సత్పతి

కోసం (యువత మాత్రమే నిర్వహించే) నాలుగు పీఎస్‌లు, ఇరవై చొప్పున మోడల్ పోలింగ్ స్టేషన్లను ఆయా కేటగిరీలకు చెందిన ఓటర్లు అధికంగా ఉన్న చోట ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. 12డీ ద్వారా ఓటు హక్కు వినియోగించుకునేందుకు 373 మంది దివ్యాంగులు, 644 మంది వృద్ధులు, 178 మంది ఎస్సెన్సియల్ ఓటర్లను గుర్తించామన్నారు. ఈనెల 30న జరిగే పోలింగ్‌లో పాల్గొనే ఓటర్లకు ఓటరు సమాచార స్లిప్పులు కూడా పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. కరీంనగర్ సెగ్మెంట్ పరిధిలో ఈనెల 25వరకు 3,55,054, చొప్పదండిలో ఈనెల 23వరకు 2,32,990, మానకొండూర్‌లో ఈనెల 22వరకు 2,21,613, హుజూరాబాద్‌లో ఈనెల 21వరకు 2,49,558 స్లిప్పులు పంపిణీ చేయనున్నట్లు స్పష్టం చేశారు. 84 బృందాలతో పార్టీలు, అభ్యర్థుల ప్రచారాన్ని ఎంసీసీ ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందాలతో నిరంతరం పర్యవేక్షిస్తున్నామన్నారు. వీటిలో 15 ఎఫ్ఎస్‌టీ, 12ఎస్ఎస్‌టీ, 12వీఎస్‌టీ, 5వీవీటీ, 23ఎంసీసీ, 4ఏఈవో, 4అకౌంటింగ్, 4ఆడిట్ బృందాలతో పాటు 4 ఇంటిగ్రెటెడ్ చెక్‌పోస్టులు కూడా ఏర్పాటు చేసినట్లు వివరించారు. జిల్లా సరిహద్దులైన ముగ్దుంపూర్, సిరిసేడు, రేణికుంట, ఆర్నకొండ, హుజూరాబాద్‌లోని పర్కాల ఎక్స్‌రోడ్ ప్రాంతాల్లో ఇరవై నాలుగు గంటల పాటు పని చేస్తున్నట్లు పేర్కొన్నారు. అలాగే ఎవరైనా ఎన్నికల నిబంధనలను అతిక్రమిస్తే సీ–విజిల్ యాప్ లేదా టోల్‌ఫ్రీ నెంబర్ 1950 ద్వారా ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. ఫిర్యాదులపై విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

# నాలుగు చోట్ల డబుల్ బీయూలు

- కరీంనగర్, రామగుండం, హుజూరాబాద్, మంథని సెగ్మెంట్లలో వినియోగం
- ఏర్పాట్లు చేస్తున్న ఎన్నికల సంఘం

కలెక్టరేట్, నవంబర్ 18: ఉమ్మడి జిల్లాలోని నాలుగు అసెంబ్లీ నియోజకవర్గాల్లో రెండు బ్యాలెట్ యూనిట్లు వినియోగించనున్నారు. ఇందుకు సంబంధించి ఏర్పాట్లు చేయడంలో అధికారులు నిమగ్నమయ్యారు. ఇప్పటికే అవసరమైన అదనపు బ్యాలెట్ యూనిట్లను ర్యాండమైజేషన్ చేసి, ఆయా సెగ్మెంట్ల డిస్ట్రిబ్యూషన్ సెంటర్లకు కూడా తరలించారు. ఒక్కో బ్యాలెట్ యూనిట్‌లో 16 మంది అభ్యర్థులతో పాటు నోటా సౌకర్యం మాత్రమే ఉంటుంది. అయితే ఉమ్మడి జిల్లాలోని నాలుగు సెగ్మెంట్లలో మాత్రం అంతకు మించి అభ్యర్థులు ఈసారి బరిలో నిలిచారు. నామినేషన్ల ఉపసంహరణ అనంతరం కరీంనగర్‌లో అత్యధికంగా 27మంది, రామగుండంలో 23, హుజూరాబాద్‌లో 22, మంథనిలో 21మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు. అభ్యర్థులు 17 నుంచి 32లోపు ఉంటే రెండో బ్యాలెట్ యూనిట్ ఏర్పాటు చేయడం అనివార్యం. దీంతో ఆయా నియోజకవర్గాల్లో పోలింగ్ రోజున వినియోగించనున్న ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలకు రెండు బ్యాలెట్ యూనిట్ల చొప్పున అమర్చి పోలింగ్ నిర్వహించేందుకు చర్యలు చేపట్టారు. ఒక్కో ఈవీఎంకు మూడు ప్రధాన విభాగాలుంటాయి. ఓటర్లు వినియోగించే బ్యాలెట్ యూనిట్, పోలింగ్ అధికారుల వద్ద ఉండే కంట్రోల్ యూనిట్, ఏ గుర్తుకు ఓటేసామో ఓటర్లు చూసుకున్న అనంతరం గుర్తుకు సంబంధించిన స్లిప్‌ను విడుదల చేసే వీవీ ప్యాట్లు ముఖ్యమైనవి. కాగా ఈసారి ఆ నాలుగు చోట్ల రెండో బ్యాలెట్ యూనిట్ కూడా వీటిలో చేరనుంది. అయితే దీనిని అమర్చేందుకు ఎం–3 రకం ఈవీఎంలు వినియోగిస్తున్నారు. వీటి ద్వారా ఒక్కో కంట్రోల్ యూనిట్‌కు వీవీ ప్యాట్‌తో పాటు అత్యధికంగా 24 బ్యాలెట్ యూనిట్లు అమర్చే అవకాశం ఉంటుంది. ఒక్కో బ్యాలెట్ యూనిట్ ద్వారా 1500 స్లిప్పులు మాత్రమే విడుదలవుతాయి. అయితే ఇందులో 50 స్లిప్పులు ముందుగానే మాక్ పోలింగ్ ద్వారా ఏజెంట్లు ఉపయోగించనుండగా, మిగతా 1450 స్లిప్పులు ఓటర్లు ఉపయోగించే అవకాశం ఉంది. వీటిని ఈవీఎంలకు అనుసంధానించే విధానంపై ఇప్పటికే ఆయా సెగ్మెంట్లలోని ప్రిసైడింగ్, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులకు ఆయా జిల్లా కేంద్రాల్లో శిక్షణ కూడా ఇచ్చారు. ఆయా జిల్లాల ఎన్నికల అధికారులు శిక్షణా శిబిరాల్లో అవసరమైన సలహాలు, సూచనలు కూడా చేశారు. కాగా డబుల్ బ్యాలెట్ యూనిట్ల ఏర్పాటుతో పోలింగ్ ఆలస్యం కానుండగా, ఓటర్లు గందరగోళానికి గురయ్యే అవకాశముంటుందనే ఆందోళన ప్రధాన పార్టీల అభ్యర్థుల్లో నెలకొన్నది.

# కోరుట్ల బీజేపీకి బిగ్ షాక్



మెట్‌పల్లి : మాట్లాడుతున్న సాంబారి ప్రభాకర్ , పక్కన పద్మశాలీ సంఘం నాయకులు

- రాష్ట్ర కార్యవర్గ పదవికి సాంబారి ప్రభాకర్ రాజీనామా
- ఎంపీ అర్వింద్ వైఖరికి నిరసనగా పార్టీకి గుడ్‌బై

మెట్‌పల్లి, నవంబర్18: అసెంబ్లీ ఎన్నికల పూట కోరుట్ల నియోజకవర్గంలో బీజేపీకి బిగ్ షాక్ తగిలింది. మెట్‌పల్లి మాజీ సర్పంచ్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, పద్మశాలి సామాజిక వర్గానికి చెందిన సాంబారి ప్రభాకర్ ఆ పార్టీని వీడారు. శనివారం మెట్‌పల్లిలోని ఆయన స్వగృహంలో విలేకరులతో మాట్లాడారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడి పదవికి, ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. టీడీపీలో సీనియర్ నాయకుడిగా ఉన్న తన వద్దకు 2019 జరిగిన ఎంపీ ఎన్నికల టైంలో ప్రస్తుత ఎంపీ ధర్మపురి అర్వింద్ వచ్చి మద్దతు అడిగారని, అలాగే వచ్చే ఎన్నికల్లో బీజేపీ తరపున ఎమ్మెల్యేగా పోటీ చేసేందుకు అవకాశం కూడా కల్పిస్తానని మాట ఇచ్చారని చెప్పారు. ఈ క్రమంలో అర్వింద్ గెలుపు కోసం అహర్నిశలు కష్టపడ్డానని చెప్పారు. ఇటీవల కోరుట్ల పట్టణంలో పద్మశాలీ యుద్ధభేరి సభను తన భుజస్కందాలపై వేసుకుని విజయవంతం చేశానన్నారు. సభ తర్వాత కోరుట్ల నియోజకవర్గంపై ఎంపీ అర్వింద్ దృష్టి పడిందని, స్వలాభం కోసం పోటీచేస్తూ గతంలో తనకు ఇచ్చిన హామీని వంచించాడని ప్రభాకర్ ఆరోపించారు. ఇలాంటి మోసపూరిత వ్యక్తితో కలిసి పని చేయడం ఇష్టంలేక బీజేపీని వీడుతున్నట్లు స్పష్టం చేశారు. రాజీనామా పత్రాన్ని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డికి పంపినట్లు తెలిపారు. భవిష్యత్ కార్యాచరణను ఒకటి రెండ్రోజుల్లో కార్యకర్తలతో చర్చించి ప్రకటిస్తానన్నారు. ఇక్కడ సురేశ్, చాట్ల గణేశ్ ఉన్నారు.

# హోరాహోరీగా సీఎస్‌ఏ క్రీడా పోటీలు



పోటీల్లో తలపడుతున్న క్రీడాకారులు

కొత్తపల్లి, నవంబర్ 18: 18వ తెలంగాణ రాష్ట్ర స్థాయి సీఎస్‌ఏ క్రీడా పోటీలు హోరాహోరీగా సాగుతున్నాయి. జిల్లా కేంద్రంలోని సెయింట్ జాన్ ఉన్నత పాఠశాల మైదానంలో శనివారం రెండో రోజు పోటీలను పాఠశాల ప్రిన్సిపాల్ సిస్టర్ ఇన్నాళ్లు, సెయింట్ జోన్స్ పాఠశాలల రాష్ట్ర అధ్యక్షురాలు జబమాల, రాష్ట్ర కన్వీనర్ సిస్టర్ మార్గరెట్ క్రీడాకారులను పరిచయం చేసుకొని పోటీలను ప్రారంభించారు. రెండో రోజు పోటీల్లో వివిధ జిల్లాల నుంచి హాజరైన క్రీడాకారులకు ఖోఖో, కబడ్డీ, వాలీబాల్, అథ్లెటిక్స్, బాస్కెట్‌బాల్, క్యారమ్స్, చెస్ పోటీలను నిర్వహించారు. పోటీల నిర్వహణలో పాఠశాల వ్యాయమోపాధ్యాయులు వై ప్రేంరెడ్డి, వెంకటలక్ష్మి, కృష్ణ, భార్గవ్, తదితరులు పాల్గొన్నారు. కాగా సీఎస్‌ఏ క్రీడల నిర్వహణలో భాగంగా పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు ప్రేంరెడ్డిని సహచర ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. 30 ఏండ్లుగా వ్యాయామ ఉపాధ్యాయుడిగా సేవలందించి అనేకమంది క్రీడాకారులను జాతీయ, అంతర్జాతీయ స్థాయికి తీర్చిదిద్దిన ఆయన త్వరలో పదవీ విరమణ చేయనున్నారు. ఈ కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు ఎం చంద్రశేఖర్, సీహెచ్ సంపత్‌రావు, బి రాజగోపాల్, హరికిషన్, వి సూర్యప్రకాష్, దూడ సత్యానంద్, కట్ట సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED

WANTED

★ రామకృష్ణ గ్రూప్ (TS No. 1) Hyd. శ్రీమంతుల ఇండ్లలో వృద్ధులకు/పేషెంట్ల సేవకు, వంట/ఇంటి పని, బేబీకేర్ కొరకు M/F వర్కర్లు కావలెను. భో+వ+జీతం: 15-21 వేలు. ఏజెంట్లకు 5 వేలు కమీషన్. తెలంగాణ అంతటా వర్కర్లను మీ ఇంటికి పంపగలము. Ph: 9618802390, 9912611122.
NT-314452

REAL ESTATE

★ రియల్ ఎస్టేట్ రంగంలో పెట్టుబడి పెట్టడం ద్వారా ప్రతిరోజు ఆదాయం పొందే అవకాశం. యాదగిరిగుట్టలో లగ్జరీ సూట్ ప్లాట్స్ కేవలం 26 లక్షలకే లాంచింగ్ ఆఫర్లో కలవు. సంప్ర|| సెల్: 9381128358
NTK-316682

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన
నమస్తే తెలంగాణ
క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం
200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి
50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
Cell: 91827 77571
91827 77194